క్లుప్తంగా

రెడ్‌క్రాస్ ప్రాంగణంలో స్వచ్ఛ భారత్



రెడ్‌క్రాస్ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న వలంటీర్లు

కంబాలచెరువు: నగరంలోని ఇన్నీస్‌పేటలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనం ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలోని 48 మంది ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు ఇందులో పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ జీఎస్‌వీఏబీఎస్ మహాలక్ష్మి, డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, పి.సాయి, కె.మహేశ్వరి, ఆకుల శిరీష తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రూరల్ ఒకటో మండల అధ్యక్షుడిగా శివకుమార్



శివకుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ రాజమండ్రి రూరల్ ఒకటో మండలం అధ్యక్షుడిగా స్థానిక కొంతమూరుకు చెందిన నాగుల శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కొంతమూరులో మండలానికి చెందిన పార్టీ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యుల ఏకాభిప్రాయంతో మండల రిటర్నింగ్ అధికారి కాలెపు సత్యసాయిరామ్ సమక్షంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాగుల శివకుమార్ మాట్లాడుతూ, మండలంలో ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు.

8వ మండల అధ్యక్షుడిగా నందివాడ




సత్యనారాయణను అభినందిస్తున్న నాయకులు

సీటీఆర్ఐ: బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాజమహేంద్రవరం ఎనిమిదో మండల పార్టీ అధ్యక్షుడిగా 41వ డివిజన్ కోటిలింగాలపేటకు చెందిన నందివాడ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యుల ఏకాభిప్రాయంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని సత్యనారాయణ తెలిపారు.

కబడ్డీ జట్టు ఎంపిక

ప్రకాశం నగర్: అంతర్ జిల్లాల కబడ్డీ బాలురు, బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ ఎంపిక ముగిసినట్లు కబడ్డీ సంఘ జిల్లా కన్వీనర్ ఏవీడీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టు జనవరి 3, 4, 5 తేదీల్లో కర్నూలులో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్
రాజా	: పుష్ప–2
ఊర్వశి	: డ్రింకర్ సాయి
మేనక	: బేబీ జాన్
రంభ	: ముఫాసా
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప–2
అశోక నామవరం	: బచ్చలమల్లి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: పుష్ప–2
మురళీకృష్ణ కడియం	: పుష్ప–2
వెంకటసూర్య	: ముఫాసా, పుష్ప–2





పార్కులో పేరుకు పోయిన వ్యర్థాలు



వాకింగ్ ట్రాక్‌పై పేరుకు పోయిన చెత్త

ఆహ్లాదానికి తాళం!

- నెలల తరబడి మూతపడిన మున్సిపల్ పార్కు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని నగరపాలక యంత్రాంగం
- విస్తుపోతున్న స్థానికులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణలోని మున్సిపల్ పార్కు అధికారుల పర్యవేక్షణ లోపంతో నెలల తరబడి మూతపడి ఉంది.నిత్యం ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదాన్ని పంచాల్సిన నగరపాలక సంస్థ మున్సిపల్ పార్క్ తాళాలు రెండు నెలలుగా తెరవలేదు. దీంతో పార్క్ అంతా చెత్తాచెదారంతో నిండి అధ్వానంగా తయారైంది. అడుగు పెట్టడానికి సైతం అవకాశం లేకుండా చెత్త పేరుకుపోయింది. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పార్క్‌కు నిత్యం తాళం వేసి ఉండడంతో స్థానికులకు ఈ సమస్య ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొంది.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ పార్కును రాజమండ్రి లయన్స్ క్లబ్ నిర్వహించేందుకు దత్తత తీసుకుంది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పార్కుకు లోనికి **వెళ్లేందుకు మాత్రం స్థానిక ప్రజలకు అవకాశం లేకుండా పోవడంతో వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఈ పార్కు రెండు వైపుల గేట్లకు తాళాలు వేసి తెరవకపోవ**డంతో, స్థానికులు ఎక్కడకు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రశాంతమైన వాతావరణం కరవైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం తాళం వేసి..

నగరంలోని పదో డివిజన్‌లో శ్రీసాయి చైతన్యనగర్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పార్కును ఏర్పాటు చేసి, అభివృద్ధి చేశారు. దీనిని పర్యవేక్షించేం రాజమండ్రి దత్తత తీసుకుంది. పార్కు నిర్వహణ క్లబ్ చేపట్టినప్పటికీ, స్థానికులకు అందు**బాటులో లేకుండా తాళం వేసి ఉంటోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్క్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, పార్కు స్థానికులకు అక్కరకు రాకుండా పోయింది. ఉద**యం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకుచ చిన్నారులు ఆడుకునేందుకు అవకాశం ఉన్న ఈ పార్కును మూసివేయడం సమంజసంగా లేదని, అధికారులు తక్షణమే పార్కు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారులు దృష్టి పెట్టాలి

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో 42 డివిజన్లలో 45 పార్కులను ఏర్పాటు చేశారు. వీటిలో 36 పార్కులను నగరపాలక సంస్థ నిర్వహిస్తుండగా, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వాకర్స్ క్లబ్ ఒకొక్కటి వంతున నిర్వహించేందుకు దత్తత తీసుకున్నాయి. మిగిలిన 6 పార్కులను గ్రీన్ గ్రాస్ ఏజెన్సీకి నిర్వహణకు అప్పగించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కులు నిర్వహణ సక్రమంగా ఉన్నప్పటికీ. లయన్స్ క్లబ్ దత్తత తీసుకున్న పార్కు తాళం వేసి మూతపడి ఉండడంతో స్థానికులు విస్తుపోతున్నారు. ఎప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్, సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టి.. ఈ పార్కును ప్రతి రోజూ ఉదయం, ,సాయంత్రం వేళల్లో తెరిచే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పార్కుకు తాళం వేసి, మూతపడి ఉన్న విషయమై నగరపాలక సంస్థ ఉద్యానవన శాఖ అధికారి స్వాతిని వివరణ కోరగా, శ్రీసాయి చైతన్యనగర్ పార్కును త్వరలోనే పూర్తిస్థాయి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. లయన్స్ క్లబ్‌కు నిర్వహణ కోసం అప్పగించామని, తాళం వేసి ఉండటంపై వారిని వివరణ కోరుతామన్నారు.





ముఖ ద్వారానికి రెండు వైపులా తాళాలు వేసి ఉన్న మున్సిపల్ పార్కు

అందుబాటులో ఉంచాలి

నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కును ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అన్ని విధాలా అభివృద్ధి చెందిన పార్కు మూసిఉండటం సరైన విధానం కాదు. పార్కు మూసిఉండటంపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలి. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పార్కు చెత్తాచెదారంతో నిండిపోవడంపై పర్యవేక్షణ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

– ఆరే చిన్ని, రాజమహేంద్రవరం

తీవ్ర ఇబ్బందిగా ఉంది

పార్కు మూసి వేసి ఉండటం స్థానికంగా ఉన్న మహిళలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వెళ్లడానికి అవకాశం లేకుండాపోయింది. చిన్న పిల్లలకు పార్కుకు తీసుకుని వెళదామంటే అవకాశం లేదు. కమిషనర్ దీనిని పరిశీలించి ప్రతి రోజూ పార్కు తెరిచి ఉండేలా చర్యలు చేపట్టాలి.

– వల్లూరి శ్వేత, రాజమహేంద్రవరం

పైకి పొత్తులు.. కడుపులో కత్తులు

- ఎమ్మెల్యే గోరంట్ల ఆత్మీయ సమావేశం నుంచి బీజేపీ, జనసేన నేతల నిష్క్రమణ
- కనీస గౌరవం కల్పించలేదని కినుక

రాజమహేంద్రవరం రూరల్: పైకి పొత్తులు.. కడుపులో కత్తులు అన్నట్టుగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణుల మైత్రి సాగుతోంది. అధికారం చేపట్టినప్పటి నుంచి జనసేన, బీజేపీల పట్ల టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు కూటమిలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. టీడీపీ సీనియర్ నాయకులు కడుపులో కత్తులు పెట్టుకుని.. పైకి స్నేహగీతం ఆలపిస్తున్నారని జనసే, బీజేపీ నేతలు భావిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన తాజా ఉదంతమే దీనికి ఉదాహరణగా నిలుస్తోంది.

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, సీనియర్ టీడీపీ నేత, గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజమహేంద్రవరంలోని ఒక కల్యాణ మండపంలో ఆదివారం కూటమి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి మూడు పార్టీల నాయకులకు ఆహ్వానాలు పలికారు. క్షేత్ర స్థాయిలో చిన్నచిన్న పొరపొచ్చాలు సర్దుబాటు చేసుకునేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందన్న భావనతో జనసేన, బీజేపీ నాయకులు దీనికి ఉత్సాహంగా హాజరయ్యారు. తీరా కల్యాణ మండపం వద్ద మొత్తం పసుపు జెండాలు మాత్రమే ఉండటంతో పాటు, వేదికపై 'టీడీపీ ఆత్మీయ అభినందన కార్యక్రమం' అని ఉండటంతో కంగు తిన్నారు. ఆత్మీయ సమావేశం పేరిట పిలిచి, కనీసం గౌరవ సూచకంగానైనా తమ పార్టీల జెండాలు పెట్టకపోవడంతో జనసేన, బీజేపీ నాయకులకు తల కొట్టేసినట్లయింది. దీంతో సమావేశం నుంచి వారు అవమాన భారంతో వెనుతిరిగారు.

రాజమహేంద్రవరం నగర టీడీపీలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రతి వ్యవహారాన్ని స్వయంగా నడిపిస్తున్నాడు. రూరల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బుచ్చయ్య చౌదరికి ఆ పార్టీలో తగినంత ప్రాధాన్యం లభించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ సమావేశం పేరిట కూటమి పార్టీల నాయకులను ఒకేచోటకు చేర్చి, అది తన ఘనతగా చెప్పుకునేందుకు బుచ్చయ్య ప్రయత్నించారని పరిశీలకులు అంటున్నారు. ఒక్క టీడీపీ నాయకులనే పిలిస్తే.. తగినంత మంది రాకపోతే అధిష్టానం ముందు అభాసుపాలవుతానన్న భావనలో ఆయన ఉన్నారని, ఈ నేపథ్యంలోనే జనసమీకరణకు కూటమిని అడ్డం పెట్టుకుంటున్నారనే చర్చ నడుస్తోంది. వాస్తవానికి ఆత్మీయ సమావేశాలు ఎన్నికలు ముందు జరుగుతూంటాయి. అయితే, రాజకీయంగా తన వారసుడిని ప్రమోట్ చేసుకునేందుకే బుచ్చయ్య ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పొత్తు ధర్మం మేరకు బుచ్చయ్య వెంట నడిచామని, లేకపోతే ఆయనకు ఓట్లు ఎవరు వేస్తారనే అభిప్రాయం జనసేన, బీజేపీ క్షేత్ర స్థాయి కార్యకర్తల్లో ఎన్నికల ముందు నుంచే ఉంది. ఈ పరిస్థితుల్లో సొంత పనికి పిలిచి, ఇలా అవమానకరంగా వ్యవహరించడాన్ని కూటమి నాయకులు తప్పు పడుతున్నారు. మొత్తమ్మీద ఈ సమావేశానికి జనసేన, బీజేపీ నాయకులు హాజరు కాకపోవడంతో ఈ పరిణామాలు మున్ముందు దేనికి దారితీస్తాయోననే ఆసక్తి నెలకొంది.



ఆత్మీయ సమావేశం నుంచి బయటకు వచ్చేసిన జనసేన, బీజేపీ నేతలు

అలరించిన స్వర రమణీయం



కార్యక్రమంలో రమణను సత్కరిస్తున్న సాయిబాబా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కళా సేవారత్న ఏవీ.రమణ ఆధ్వర్యంలో స్థానిక విక్రమ్ హాల్లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన స్వర రమణీయం అలరించింది. సుమారు నాలుగు గంటల పాటు ఘంటసాల పాటలతో పాటు, వివిధ పాటలను గాయనీ గాయకులు పాడి ఆహూతులను ఆనందింపజేశారు. ఈ సందర్భంగా ఏవీ.రమణను సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా శాలువాతో సత్కరించారు. కళాకారులు అనిశెట్టి శేఖర్, శ్రీరామ్, గోపి, బ్రహ్మం, కొప్పర్తి శైలజ, కొప్పర్తి భవ్య, మల్లాది ప్రియాంక, కోరుకొండ ప్రభ, గిరిజ తదితరులు పాటలు ఆలపించారు.

ఉద్యమాల వేదిక రాజమహేంద్రి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): కవులు, కళాకారులకు పుట్టినిల్లయిన రాజమహేంద్రి అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం రౌతు తాతాలు కల్యాణ మండపంలో సీపీఎం 24వ జిల్లా మహాసభలు రెండో రోజు కొనసాగాయి. తొలుత పార్టీ సీనియర్ నాయకుడు టీఎస్ ప్రకాష్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మంతెన సీతారాం మాట్లాడుతూ, కమ్యూనిస్టుల నాయకత్వంలో ఈ జిల్లాలో నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం యథేచ్ఛగా ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని తీవ్రంగా విమర్శించారు. అవే విధానాలను కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అనుసరిస్తోందని మండిపడ్డారు. భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు మాట్లాడుతూ, ప్రస్తుతం పాలకులు ప్రజలను మభ్యపెట్టి, వారిని కష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విజన్ 2047 ఇందులో భాగమేనని విమర్శించారు. ప్రజలను రాజకీయంగా స్థిరపర్చే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, పి.తులసి, ఎం.సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రకాష్

సర్దార్ గౌతు లచ్చన్నను అవమానించడం దారుణం

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లిబాబు
- వై జంక్షన్ వద్ద సర్దార్ విగ్రహానికి క్షీరాభిషేకం

సీటీఆర్ఐ: బడుగు, బలహీన వర్గాల నేత, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్నను, ఆయన మనవరాలిని, బీసీ నేతలను అవమానించడం దారుణమని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంక మల్లికార్జునస్వామి(మల్లిబాబు) అన్నారు. నూజివీడులో రాజకీయాలకు అతీతంగా జరిగిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వివాదాస్పదం చేసి, బీసీ నేతలతో క్షమాపణలు చెప్పించడం దారుణమన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు పిలుపు మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా, స్థానిక వై జంక్షన్ వద్ద ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ, పార్టీలకతీతంగా జరిగిన కార్యక్రమాన్ని వివాదాస్పదం చేసి, బీసీ నేతలైన మంత్రి పార్థసారథి, కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే శిరీషను అవమానించడం రాష్ట్రంలో బీసీలను అవమానించడమేనన్నారు. దీనిపై బీసీలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సిటీ, రూరల్ అధ్యక్షులు బిల్డర్ చిన్నా, లోడ అప్పారావు, నందరాడ అధ్యక్షుడు సూరంపూడి శ్రీను, ఎంపీటీసీ సింగవరపు శ్రీను, రజక సంఘం అధ్యక్షులు కడజాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

నిండు నూరేళ్లూ పాటలతో అలరించాలి

- జిత్‌మోహన్‌మిత్రాకు వక్తల ఆకాంక్ష
- ఘనంగా గాన స్వర సప్తతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ ప్రముఖుడు జిత్‌మోహన్‌మిత్రా గడిచిన ఏడు దశాబ్దాలుగా పాటలతో అలరిస్తున్నారని, నిండు నూరేళ్ల ఇలాగే ఆనందాన్ని పంచాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. నట గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా తొలిపాట పాడి 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిత్ గాన స్వర సప్తతి పేరిట 70 వసంతాల గాన వైభవ స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ సేవకుడు పట్టపగలు వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, చాంబర్ పూర్వాధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, ఇన్నీసుపేట బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు, గుమ్మడి సమర్పణరావు, డాక్టర్ కేవీ చౌదరి, తురగా సూర్యారావు, నిమ్మలపూడి గోవింద్, రవీంద్రనాథ్, కోలమూరు ప్రభాకరరావు, ఎండీ ఖాదర్‌ఖాన్, అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, కళాకారులను ప్రోత్సహించాలని, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ, సినీ నటుడిగా, గాయకుడిగా 70 ఏళ్ల పాటు అలరించడం సామాన్య విషయం కాదన్నారు. ఔత్సాహిక గాయనీగాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి మాట్లాడుతూ, జిత్‌మోహన్‌మిత్రా వందేళ్ల పాటు పాటలు పాడుతూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ, జిత్‌మోహన్ మిత్ర రాజకీయ నాయకుడిగా, గాయకుడిగా, సినీ నటుడిగా ఆయన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, జిత్‌కు 83 ఏళ్ల వయస్సులోను యువ గాయనీగాయకులతో పోటీగా పాడే సత్తా ఉందని అభినందించారు. అనంతరం జిత్ దంపతులను ఘనంగా సత్కరించారు. జిత్ మోహన్ మ్యూజిక్ అకాడమీ కళాకారులను జిత్‌మోహన్ మిత్ర బృందం సభ్యులను అతిథులు సన్మానించారు. ఈ సందర్భంగా జిత్‌మోహన్ మిత్ర మాట్లాడుతూ, త్వరలోనే సంగీత విభావరి నిర్వహిస్తానని చెప్పారు. కాగా ఉదయం పది మంది కళాకారులకు సన్మానం చేశారు. ముందుగా సంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ముద్రగడ ఏసుబాబు, పీవీఎస్ కృష్ణారావు, వి జగపతి, జె శివప్రసాద్, ఏఎస్ ఆనంద్, బిక్కిన రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



జిత్‌మోహన్‌మిత్రా దంపతులను సత్కరిస్తున్న అతిథులు



సత్కారం అందుకున్న ఆర్కెస్ట్రా కళాకారులతో జిత్‌మోహన్‌మిత్రా తదితర ప్రముఖులు

ఉపకార వేతనాల పంపిణీ

ప్రకాశం నగర్: బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి గట్టునున్న మల్లిగ సత్రంలో ఆదివారం సాయంత్రం జిల్లాలోని బ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంద మందికి రూ.5 లక్షల ఉపకార వేతనాలను ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు దంతుర్తి సత్యప్రసాద్ మాట్లాడుతూ, 2011 నుంచి ఏటా నిర్విరామంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.5 వేలు, డిగ్రీ, ఇంటర్, డిప్లమా విద్యార్థులకు రూ.4 వేల చొప్పున స్కాలర్‌షిప్పులు అందజేస్తున్నట్లు వివరించారు. ట్రస్టు సేవలను యువతీయువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు జాబ్ మేళా

రాజానగరం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ సంయుక్తాధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు ఆయా సంస్థల అధికారులు హరీష్‌చంద్ర ప్రసాద్, పేరుమాళ్‌రావు వెల్లడించారు. ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూల ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు జాబ్ మేళాకు చేరుకోవాలన్నారు. వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

స్పాపై పోలీసుల దాడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు ఈ వివరాలు తెలిపారు. ఎస్పీ నరసింహ కిషోర్‌కు అందిన సమాచారం మేరకు, ప్రకాష్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్‌కే బాజీలాల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జేఎన్ రోడ్‌లోని హ్యాపీ స్ట్రీట్ సమీపాన ఉన్న కలర్స్ బ్యూటీ సెలూన్-స్పాపై దాడి చేశారు. వ్యభిచారం జరుగుతున్నట్టు నిర్ధారించారు. స్పా నిర్వాహకులతో పాటు, ఇద్దరు విటులను, ఆరుగురు యువతులను గుర్తించి, కేసు నమోదు చేశారు. ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.